ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
హైదరాబాద్
నగర వార్తలు
మంగళవారం 3 డిసెంబరు 2024

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.6 కనిష్ఠం 22.0



'మహా' అభివృద్ధికి అంకురార్పణ

విజయోత్సవాల వేళ రూ.3,446 కోట్లతో హెచ్-సిటీ ప్రాజెక్టులు



వైట్జెస్ రోడ్ పరిధిలో సుందరీకరణ పనులు చేపడుతున్న సిబ్బంది

- నేడు శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్
- ప్రధాన కూడళ్లలో వంతెనలు, అండర్‌పాస్‌లు
- రైల్వే ట్రాక్ వద్ద ఆర్‌యూబీ/ఆర్‌ఓబీలు
- పలు రహదారుల విస్తరణ
- రూ.150 కోట్లతో సుందరీకరణ పనులు
- రోడ్లపై వరద నీరు నిలవకుండా 12 ప్రాంతాల్లో సంపుల నిర్మాణం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వ విభాగాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. మహానగర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులతో పాటు.. ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన, మహిళా పొదుపు సంఘాలకు స్వయం ఉపాధి, పారిశుధ్య, ఎంటమాలజీ కార్మికులకు హెల్త్ క్యాంపులు నిర్వహించనున్నారు. విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(హెచ్-సిటీ) ప్రాజెక్టులో భాగంగా వేర్వేరు ప్రాంతాల్లో రూ.3,446 కోట్లతో జీహెచ్‌ఎంసీ చేపట్టనున్న ప్రాజెక్టులకు ప్రసాద్ ఐ మ్యాక్స్ పక్కనున్న హెచ్‌ఎండీఏ గ్రౌండ్‌లో భూమి పూజ చేస్తారు. వంతెనలు, అండర్‌పాస్‌లు, కారిడార్ల అభివృద్ధి, నాలాల విస్తరణ, రీ మోడలింగ్ వంటి పనులు హెచ్-సిటీలో భాగంగా చేపడుతున్నారు. గ్రేటర్‌లోని ప్రధాన కూడళ్లు, రహదారులపై రూ.150 కోట్లతో చేపడుతోన్న సుందరీకరణ పనులూ ప్రారంభిస్తారు. రోడ్లపై వరద నీరు నిలవకుండా ప్రధాన రహదారుల్లోని 12 ప్రాంతాల్లో రూ.16.50 కోట్లతో వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్

మిగతా 10వ పేజీలో..

నేడు ఆరు ఎస్టీపీలు ప్రారంభం

నగరంలో ఉత్పత్తవుతున్న మురుగును శుద్ధి చేసేందుకు నిర్మించిన ఆరు సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)లను మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. నాగోల్, ఫతేనగర్, ఖాజాకుంట, మిరాలం, సఫిల్‌గూడ, మియాపూర్‌లోని పటేల్‌చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఈ ఎస్టీపీలు అందుబాటులోకి రానున్నాయి. శివారు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా కోసం ఓఆర్‌ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టులో నిర్మించిన 14 డిస్ట్రిబ్యూషన్ రిజర్వాయర్లను కూడా సీఎం ప్రారంభించనున్నారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గం పరిధిలోని వాటర్‌బోర్డు జోన్-2లోని ప్రాంతాల్లో మురుగునీటి సరఫరా వ్యవస్థను పటిష్ఠ పరిచేందుకు ఆధునీకరణ పనులను రూ.301కోట్లతో చేపట్టడానికి శంకుస్థాపన చేయనున్నారు.

సీఎం శంకుస్థాపన చేయనున్న ప్రాజెక్టులు - వ్యయం

- కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్, జూబ్లీచెక్‌పోస్ట్, రోడ్‌నంబర్-45 జంక్షన్‌ల వద్ద గ్రేడ్ సెపరేటర్, అండర్‌పాస్‌లు - రూ.580 కోట్లు
- ఫిల్మ్‌నగర్, అగ్రసేన్, కేన్సర్ ఆస్పత్రి జంక్షన్‌ల వద్ద గ్రేడ్ సెపరేటర్, అండర్‌పాస్‌లు - రూ.510 కోట్లు
- రేతిబౌలి, నానల్‌నగర్ జంక్షన్ వద్ద మల్టీ లెవల్ వంతెన/గ్రేడ్ సెపరేటర్లు - రూ.398 కోట్లు

మల్టీలెవల్ వంతెన/గ్రేడ్ సెపరేటర్లు వచ్చే జంక్షన్లు - వ్యయం

- ఖాజాగూడ - రూ.220 కోట్లు
- ఐఐఐటీ - రూ.459 కోట్లు
- విప్రో - రూ.258 కోట్లు

మరిన్ని ప్రాజెక్టులు - వ్యయం

- జాతీయ రహదారి 65 నుంచి అమీన్‌పూర్ వరకు 150 అడుగుల రోడ్డు విస్తరణ - రూ.45 కోట్లు
- సైబరాబాద్ కమిషనర్ కార్యాలయం నుంచి గచ్చిబౌలి జంక్షన్‌కు 215 అడుగుల మేర రహదారి విస్తరణ - రూ.39 కోట్లు
- అంజయ్యనగర్ నుంచి రాంకీ టవర్స్ వరకు 150 అడుగుల రోడ్డు విస్తరణ - రూ.31 కోట్లు
- నాలుగు లేన్ల స్టీల్ గర్డర్ బ్రిడ్జి - రూ.56 కోట్లు
- ఆర్‌కే పురం ఆర్‌ఓబీ- రూ.210 కోట్లు
- ఆర్‌కే పురం ఆర్‌యూబీ - రూ.35 కోట్లు
- చిలకలగూడ ఆర్‌యూబీ- రూ.30 కోట్లు
- ఓవైసీ ఆస్పత్రి వంతెన నుంచి సంతోష్‌నగర్ వైపు వెళ్లేందుకు డౌన్ ర్యాంపు - రూ.339 కోట్లు
- మైలార్‌దేవ్‌పల్లి, శంషాబాద్, కాటేదాన్ జంక్షన్ల మీదుగా ఆరు లేన్ల వంతెన - రూ.200 కోట్లు
- ఆరాంఘర్ జంక్షన్ సమీపంలో రెండు లేన్ల ఆర్‌యూబీ - రూ.59 కోట్లు
- బాలాపూర్‌లోని అజీమ్ హోటల్ నుంచి చర్చి గేటు వరకు - రూ.11 కోట్లు
- చాంద్రాయణగుట్ట ఎక్స్ రోడ్డు నుంచి బార్కస్ మీదుగా చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ వరకు 80 అడుగుల రహదారి విస్తరణ - రూ.9 కోట్లు
- చార్మినార్ జోన్‌లో లక్కీ స్టార్ హోటల్ నుంచి హఫీజ్‌బాబా నాగర్ వరకు రోడ్డు విస్తరణ - రూ.57 కోట్లు

రోడ్లపై అంధకారం

ప్రాణసంకటంగా చీకటిలో ప్రయాణం

- బిక్కుబిక్కుమంటూ వెళ్తున్న పౌరులు
- వెలుగులపై పట్టించుకోని ఈఈఎస్‌ఎల్
- బిల్లులు ఇవ్వట్లేదని పంచాయితీ
- వెలుగులే లేకుండా బిల్లులు ఎలాగని జీహెచ్‌ఎంసీ వాదన
- పౌరుల ఫిర్యాదులూ బేఖాతర్
- ఈఈఎస్‌ఎల్ టర్మినేషన్‌కు యోచన..?
- న్యాయపరమైన ఇబ్బందుల నేపథ్యంలో పునరాలోచన

సికింద్రాబాద్ నుంచి వెళ్లే రాజీవ్ రహదారిపై అర్ధరాత్రి దాటాక వీధిదీపాలు వెలగడం లేదు. ప్రధాన రహదారి కావడంతో ఎదురుగా వచ్చే వాహనాల లైట్ల ఫోకస్ పడి.. రోడ్డుపై ముందు ఏముందనేది కనిపించడం లేదు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ దుస్థితి ఒక్క సికింద్రాబాద్‌లోనే కాదు.. చాలా ప్రాంతాల్లో కనిపిస్తోంది. ప్రజల అవస్థలను గమనించడం, ఫిర్యాదులను పరిష్కరించడం మానేసి ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్‌ఎల్), జీహెచ్‌ఎంసీకి పంచాయితీలకు దిగుతున్నాయి.

\- హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి)



హిమాయత్‌నగర్ పరిధిలో వెలగని వీధి దీపం

గ్రేటర్‌లో వీధి దీపాల లెక్క

ఎల్‌ఈడీ దీపాలు	5,27,963
సీసీఎంఎస్ ఆటోమేటిక్	29,947
మాన్యువల్	265
మొత్తం	30,212
నిత్యం సగటున వస్తోన్న ఫిర్యాదులు	1000 కిపైగా
గతంలో రోజూ వచ్చిన ఫిర్యాదులు	800
నెలకు ఈఈఎస్‌ఎల్‌కు చెల్లించే మొత్తం	రూ. 8 కోట్లు

'వీధి దీపాల నిర్వహణ సరిగా లేదు. పౌరుల నుంచి వస్తోన్న ఫిర్యాదుల్లో ఎక్కువ స్ట్రీట్ లైట్స్‌కు సంబంధించినవే ఉంటున్నాయి. నిర్వహణ మెరుగుపడితేనే.. బకాయిలు చెల్లిస్తాం'

\- జీహెచ్‌ఎంసీ

'ఇప్పటికే రూ.85 కోట్ల బకాయి ఉంది. డబ్బులు ఇవ్వకుండా పనులెలా చేయాలి. లైట్లు కొనుగోలు చేయాలన్నా.. సిబ్బందికి వేతనాలు ఇవ్వాలన్నా.. నిధులు ఇవ్వకుండా ఏం చేస్తాం'

\- ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్‌ఎల్).

ఈ రెండు సంస్థల మధ్య పోరుతో గ్రేటర్‌లోని సామాన్య పౌరులు ఇబ్బందులు పడుతున్నారు. ఎవరికి వారు తగ్గేదేలే.. అన్నట్టుగా వ్యవహరిస్తుండడంతో కాలనీ, బస్తీ అన్న తేడా లేకుండా రహదారులు అంధకారంగా మారుతున్నాయి. సాధారణంగానే అంతంత మాత్రంగా ఉన్న వీధిదీపాల నిర్వహణ.. కొన్నాళ్లుగా మరింత అధ్వానంగా మారింది. ఫిర్యాదు చేసినా అటు అధికారులు, ఇటు ఈఈఎస్‌ఎల్ పట్టించుకోవడం లేదు. మరో ఆరు నెలల్లో ఒప్పందం ముగియనుండడం (ఏప్రిల్ 2025)తో ఇరు సంస్థలు ఏం పట్టనట్టు వ్యవహరిస్తున్నాయి. గతంలో రోజూ సగటున 800 ఫిర్యాదులు రాగా, కొన్నాళ్లుగా 1000 దాటాయి. అయినా పట్టించుకునే పరిస్థితి లేదు.

అంధకారంతో మరింత ఆదా..

విద్యుత్ ఆదా.. ఖర్చు తగ్గించేందుకు గ్రేటర్‌లో ఎల్‌ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 2015 నుంచి విడతల వారీగా సాధారణ వీధి దీపాల స్థానంలో ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు ప్రారంభించారు. 2018 నాటికి నగరంలో వేర్వేరు వాట్ల 5.27 లక్షల

మిగతా 10వ పేజీలో..

చావాలనుకుంటే

యూ కెన్ డూ ఇట్

- కన్నడ నటి శోభిత సూసైడ్ నోట్
- దీని ఆధారంగా కేసు విచారణను ముమ్మరం చేసిన పోలీసులు
- భర్త ఇంట్లో ఉండగానే ఆత్మహత్యపై అనుమానాలు



ఉస్మానియా వద్ద విలేకరులతో మాట్లాడుతున్న శోభిత మామ బుచ్చిరెడ్డి

రాయదుర్గం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): కన్నడ సీరియల్ నటి శోభిత ఆత్మహత్య కేసు దర్యాప్తును గచ్చిబౌలి పోలీసులు ముమ్మరం చేశారు. ఆమె కుటుంబసభ్యులు గచ్చిబౌలి పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా శోభిత మృతి చెందిన గదికి వెళ్లిన పోలీసులకు 'ఎవ్రీథింగ్ పర్ఫెక్ట్.. చావాలనుకుంటే యూ కెన్ డూ ఇట్' అని రాసి ఉన్న లెటర్ లభ్యమైంది. దాని ఆధారంగానే కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే శోభిత భర్త, ఆయన కుటుంబసభ్యులతో పాటు వారు ఉంటున్న ప్రాంతంలో ఇరుగుపొరుగు వారి స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డు చేశారు.

సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా..

కన్నడలో పలు సీరియల్స్, ఒక సినిమాలో నటించిన శోభిత సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేదని తెలిసింది. అయితే పెళ్లి, భర్త గురించి ఆమె సోషల్‌మీడియాలో ఎప్పుడూ ప్రస్తావించలేదు. పెళ్లి అనంతరం నటనకు దూరమైన శోభితకు పెళ్లి, భర్త పట్ల అసంతృప్తి ఏర్పడిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గత వారం గోవాలో జరిగిన ఫిలిం ఫెస్టివల్‌కు వెళ్లి వచ్చాక డిప్రెషన్‌కు లోనై ఉంటుందా అనేదీ పరిశీలిస్తున్నారు.

కీలకంగా సూసైడ్ నోట్

శోభిత సూసైడ్‌నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో ఎవరిని ఉద్దేశించి రాసింది., ఏ సందర్భంగా రాసి ఉంటుందనే అంశంపై పోలీసులు విచారణ చేపడుతున్నారు. భర్త ఇంట్లో

మిగతా 10వ పేజీలో..

ఆత్మహత్య చేసుకుందంటే నమ్మలేకపోతున్నాం
- శోభిత మామ బుచ్చిరెడ్డి

10



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

క్వింటాళ్ల నుంచి కిలోలకు..

- సత్ఫలితాలనిస్తున్న ఆపరేషన్ ధూల్‌పేట్
- గంజాయిని తుదముట్టించడమే లక్ష్యం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): క్వింటాళ్ల కొద్దీ గంజాయి అమ్ముడయ్యే ధూల్‌పేటలో.. ఇకపై గంజాయి వాసన రాకుండా చేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులు 'ఆపరేషన్ ధూల్‌పేట్' అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది జులై నుంచి నిరంతరాయంగా కొనసాగుతోంది. గంజాయి అమ్మకాలపై ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా పెట్టడం, నిందితులను పట్టుకోవడం, కోర్టులో హాజరుపరచడం వంటి కార్యక్రమాల ద్వారా స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఒకప్పుడు ధూల్‌పేట్‌లో క్వింటాళ్ల కొద్దీ గంజాయి అమ్మేస్థాయి నుంచి ప్రస్తుతం కేజీ మోతాదులో కూడా విక్రయించడానికి భయపడే పరిస్థితిని తీసుకొచ్చారు. ఆపరేషన్ ధూల్‌పేట్ కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తుండటంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి నిర్మూలనపై అవగాహన..

ఆపరేషన్ ధూల్‌పేటలో భాగంగా దాదాపు నాలుగు నెలల నుంచి ఎక్సైజ్ దాడులు కొనసాగుతున్నాయి. గంజాయి అమ్మకాలను పూర్తిగా నిలిపివేయించాలనే నిర్ణయంతో గంజాయి నిర్మూలనపై ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి అమ్మకాలు పూర్తిగా మానుకోవాలని కోరారు. గంజాయి అమ్మకాలు మళ్లీ చేపడితే 68ఎఫ్/ఎన్‌డిపిఎస్ యాక్టు ప్రకారం ఆస్తులను జప్తు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

ప్రముఖులకు ఎర

- ప్రారంభోత్సవాల పేరుతో హడావిడి
- సినిమావారిని ముంచేసిన కాంతిదత్
- పోలీసుల విచారణలో అనేక విషయాలు వెలుగులోకి

10

కార్లను అద్దెకు తీసుకొని టోకరా

- కిలా(లే)డీ ముఠా అరెస్ట్
- రూ. 2.50 కోట్ల విలువైన 21 కార్లు స్వాధీనం

10


ప్రజలను జాగృతం చేసే శక్తి కళలు, సాహిత్యానికే సొంతం

- తెలుగు వర్సిటీ బాచుపల్లి ప్రాంగణం ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

8

'ఇల్లు కట్టి చూడు - పెళ్లి చేసి చూడు' అన్నది లోకోక్తి. ఈ మహానగరంలో సొంతింటి సంగతేమో గానీ పెళ్లి ఖర్చు మాత్రం మధ్యతరగతికి తలకుమించిన భారమే! అందులోనూ అమ్మాయిల తల్లిదండ్రుల కష్టాలు చెప్పనలవికావు. ఒకరిని చూసి మరొకరన్నట్టు వివాహ విందులు, వినోదాలకు స్థోమతకు మించి సొమ్ము వెచ్చిస్తున్నారు. తలకుమించిన భారాన్ని మీదేసుకుని అప్పుల పాలవుతున్నారు. అయితే.. కొందరు పెళ్లిళ్లలో అనవసర వ్యయాలకు స్వస్తి పలికి, ఆడంబరాలు లేని పద్ధతులకు 'జై' కొడుతున్నారు. వాటిని తమ సామాజిక వర్గంలో ఒక నిబంధనగా అమలు చేస్తున్నారు.

ఆ పెళ్లిళ్ల రూల్సే వేరయా!



అక్రమ్ ఖురేషీ

- ఖురేషీల వివాహ విందులో రెండో పదార్థం వడ్డిస్తే జరిమానా
- వధువు కుటుంబంపై భారం తగ్గించేందుకు సంఘం నిబంధన
- కట్నంలేని పెళ్లిళ్లకు ఉచితంగా ఫంక్షన్ హాలు ఇస్తున్న సోషియో రిఫార్మ్స్ సొసైటీ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వివాహ ఆడంబరాల విషయంలో ఇరుగు పొరుగు, బంధువర్గాల మధ్య పోటీ పెరిగిపోయింది. దాంతో హంగు ఆర్భాటాలకు హద్దులు చెరిగిపోయాయి. దీనికి కుల, మత, ప్రాంతాలతో సంబంధం లేదు. భిన్న సంస్కృతుల్లో వివాహ పద్ధతులు వేరైనా, గొప్పలకు పోయి తాహతుకుమించి సొమ్ము వెచ్చించడంలో మాత్రం అందరిదీ ఒకటే తీరు. పెట్టుపోతలు, విందు భోజనాలు తదితర పెళ్లి ఖర్చుల విషయంలో ఆడపిల్ల కుటుంబానికి మరింత భారం అవ్వడం కూడా సాధారణమే. ఈ నేపథ్యంలో పెళ్లిళ్లలో అనవసరమైన ఖర్చులు తగ్గించడానికి హైదరాబాద్‌లోని జమియాత్ ఉల్ ఖురేషీ సంఘం వినూత్న నిబంధన పాటిస్తోంది. అదేంటంటే.. పెళ్లిలో కేవలం ఒక ఆహార పదార్థం మాత్రమే వడ్డించాలి. దానికి విరుద్ధంగా వెళితే జరిమానా చెల్లించాల్సిందే! అయితే ఈ నియమం అమ్మాయి కుటుంబానికి మాత్రమే వర్తిస్తుందని ఖురేషీ కమ్యూనిటీ సభ్యులు చెబుతున్నారు. నగరంలో లక్షకుపైగా ఖురేషీలుంటారు. వారందరి జీవనాధారం బీఫ్ దుకాణాల్లో పనిచేయడం. వీరిలో ఎక్కువమంది పేదరికంలో మగ్గుతున్న వారే. ఇలాంటి పరిస్థితుల్లో పెళ్లి ఖర్చుల భారాన్ని మోయలేక ఆడపిల్లల తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న అవస్థను గమనించిన సంఘం పెద్దలు ఎనిమిదేళ్ల కిందట ఒక నిబంధన రూపొందించారు. అమ్మాయి కుటుంబం సంపన్నులైనా, నిరుపేదలైనా సరే, నికా వేడుకలో అతిథులకు కేవలం ఒక ఆహార పదార్థాన్ని మాత్రమే వడ్డించాలని షరతు పెట్టారు. దాన్ని అతిక్రమిస్తే జరిమానా విధిస్తారు. తొలినాళ్లలో ఛాయ్ లేదా ఐస్‌క్రీమ్ ఏదో ఒకటి మాత్రమే పెళ్లిలో వడ్డించేవారట. దూరప్రాంతాల నుంచి వచ్చే బంధువులను దృష్టిలో పెట్టుకుని కొంతకాలంగా కేవలం బిర్యానీ వడ్డిస్తున్నారు. రెండో వంటకం

మిగతా 10వ పేజీలో..



మాజీ సీఎం చెన్నారెడ్డికి నివాళి

మాజీ సీఎం, మాజీ గవర్నర్ డాక్టర్ మర్రి చెన్నారెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం ఇందిరాపార్కులోని చెన్నారెడ్డి మెమోరియల్ రాక్‌గార్డెన్‌లో ఆయన సమాధివద్ద శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు పుష్పగుచ్ఛాలతో నివాళులు అర్పించారు. - ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ప్రజలను జాగృతం చేసే శక్తి
కళలు, సాహిత్యానికే సొంతం

● తెలుగు వర్సిటీ బాచుపల్లి ప్రాంగణం ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సు, ప్రజలను జాగృతం చేసే శక్తి కళలు, సాహిత్యం, సామాజిక శాస్త్రాలకు సొంతమని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. అయితే, వీటికి సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పోటీ ప్రపంచానికి తగినట్టుగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం సైతం సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం బాచుపల్లి ప్రాంగణాన్ని మంత్రి సోమవారం ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాలానికి తగినట్టుగా కళాకారులు సృజనాత్మకతను సంతరించుకొని ముందుకెళ్లడం ద్వారానే కళలు వర్ధిల్లుతాయని అభిప్రాయపడ్డారు. ఆ దిశగా విద్యార్థులు సామాజిక శాస్త్రాలు, జానపద, లలిత కళల రంగాల్లో పరిశోధనలు చేయాలని ఆకాంక్షించారు. వర్సిటీ ఉపాధ్యక్షుడి కోరిక మేరకు కంప్యూటర్లతో పాటు డిజిటల్ బోర్డులు తదితర సాంకేతిక పరికరాలను సమకూర్చుతానని మంత్రి హామీ ఇచ్చారు. శాంతా వసంత ట్రస్ట్ ద్వారా వరప్రసాదరెడ్డి నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలను మంత్రి కొనియాడారు.

సభాధ్యక్షత వహించిన వర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం బోధనా సిబ్బంది సంఖ్య 80నుంచి 8మందికి పడిపోయిందని, ఖాళీలను భర్తీ చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి. బాలకృష్ణారెడ్డి, నిజాంపేట మేయర్ కొలన్ నీలారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి కలెక్టర్ గౌతంపోట్రు, అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎండీ సాబేర్ అలీ, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా.. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నూతన ఉపాధ్యక్షుడుగా కొలువుదీరిన ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధికార పార్టీని కీర్తించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. 'చదువుల వనంలో ఈ రాజకీయ భజనలు ఏమిటి' అని బోధన, బోధనేతర సిబ్బంది సైతం అసంతృప్తి వ్యక్తం చేశారు.

వరప్రసాదరెడ్డికి విశిష్ట అవార్డు



వరప్రసాద్‌రెడ్డికి అవార్డును ప్రదానం చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, వర్సిటీ వీసీ నిత్యానందరావు తదితరులు

సుదీర్ఘకాలంగా తెలుగు భాషా సాంస్కృతిక రంగాలకు అందిస్తోన్న సేవలకు గాను శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కేఐ వరప్రసాద్‌రెడ్డికి సోమవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఆయనను శాలువ, జ్ఞాపికతో సన్మానించి, లక్ష రూపాయల నగదును మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదగా బహూకరించారు. అయితే, తనకు ఇచ్చిన లక్షకు మరో రూ.99లక్షలు కలిపి వరప్రసాదరెడ్డి కోటి రూపాయల చెక్కును మంత్రి సమక్షంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావుకు విరాళంగా అందించారు. విశ్వవిద్యాలయం మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలని ఆయన కోరారు. ఆయన దాతృత్వానికి సభికులంతా చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

నేను శాస్త్రవేత్తను కాను..

తెలుగు విశ్వవిద్యాలయం నుంచి విశిష్ట పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా తన ప్రసంగం ద్వారా వరప్రసాదరెడ్డి ఆనందాన్ని వ్యక్తం చేశారు. 'నన్ను చాలామంది శాస్త్రవేత్తగా సంబోధిస్తుంటారు. నేను కేవలం ఇంజనీరును మాత్రమే. ఎలాంటి ఔషధాలు, టీకాలు కనుగొనలేదు. వాటిని కనిపెట్టేందుకు అవసరమైన సహకారాన్ని శాస్త్రవేత్తలకు అందించాను. వారికి చేదోడువాదోడుగా నిలిచాను' అని వరప్రసాదరెడ్డి అన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

తెలుగు వర్సిటీ పూర్వవిద్యార్థులు ప్రతిష్ఠాత్మక ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారాలు అందుకున్న డప్పు కళాకారుడు అందె భాస్కర్, ఒగ్గు రవి, పేరిణి రాజ్‌కుమార్ నృత్య ప్రదర్శనలు, గాయని శ్వేతాప్రసాద్ అన్నమయ్యకీర్తనల ఆలాపన ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా 'మత్తువదలరా' అంటూ ప్రదర్శించిన లఘు నాటిక ఆలోచింపచేసింది.

హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్‌గా రవీందర్



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్‌గా బి.రవీందర్, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) సీజీఎంగా సీహెచ్.పరంజ్యోతి నియమాకమయ్యారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ హోదాలో హెచ్‌జీసీఎల్ సీజీఎంగా కొనసాగుతున్న రవీందర్‌ను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పించింది. తాజాగా ఆయన్ను హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్‌గా నియమించారు. హెచ్ఎండీఏ ఇన్‌చార్జీ చీఫ్ ఇంజనీర్‌గా కొనసాగుతున్న సీహెచ్.పరంజ్యోతి సైతం ఇటీవల చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందారు. ఆమెను హెచ్‌జీసీఎల్ సీజీఎంగా నియమించారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ ఉత్తర్వులను జారీ చేసింది.

వర్గీకరణను వ్యతిరేకించే వారందరినీ
శత్రువులుగా చూస్తాం

మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

పంజాగుట్ట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణను వ్యతిరేకించే వారందరినీ తాము శత్రువులుగానే చూస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను ఏ పార్టీ వ్యతిరేకించడం లేదని, ఎవ్వరూ అడ్డుకోలేరని అన్నారు. మాలలను భ్రమలో పెట్టకుండా, పక్కదారి పట్టించకుండా మీకు చేతనైతే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వర్గీకరణను వ్యతిరేకించే పార్టీలో చేరండి లేదా మీరే ఒక పార్టీ పెట్టుకోండని ఆయన అన్నారు. వర్గీకరణను వ్యతిరేకించే వారు రాజీనామా చేసి ఎన్నికలకు రావాలని పిలుపునిచ్చారు. మాలలది తొండి ఆట అని, వారు సైకోలుగా మారారని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు, రిజర్వేషన్లకు ఇంకా అడ్డు తగులుతామని చెప్పే మనువాదులకి సామాజిక న్యాయం దృష్టిలో పెట్టుకొని ఈ సమావేశం ఏర్పాటు చేశామని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మీనవల్లి మాచర్‌రావుకు ఘనసన్మానం



మాచర్‌రావును సన్మానిస్తున్న ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

మియాపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్-టెండర్/ ప్రొక్యూర్‌మెంట్ కమిటీ సభ్యుడిగా నియమితులైన సీఏ మీనవల్లి మాచర్‌రావును సోమవారం రాత్రి హఫీజ్‌పేట వసంతసిటీలోని వసంత క్లబ్‌లో ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ మాచర్‌రావు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. కాగా, తనకు ఇచ్చిన పదవిని మరింత బాధ్యతతో నిర్వర్తిస్తానని, చంద్రబాబు, నారా లోకేశ్‌ల నమ్మకాన్ని నిలబెడతానని మాచర్‌రావు చెప్పారు. ఏపీ స్టేట్ క్రియేటివ్ అండ్ కల్చరల్ కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, సీఏ జె.వెంకటేశ్వర్లు, సీఏ ఎం.వెంకట నరసింహం తదితరులు పాల్గొన్నారు.

21 ఏళ్ల పిల్లి మృతి

● కన్నీటి పర్యంతమైన యజమానులు
● శోకసంద్రంతో అంత్యక్రియలు




పిల్లి మృతితో శోకసంద్రంలో శ్రీదేవీ కుటుంబసభ్యులు

అంబర్‌పేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో 21 ఏళ్ల పాటు అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లి మృతి చెందడంతో దాని యజమానులు కన్నీటి పర్యంతమయ్యారు. తమ సొంత కుటుంబసభ్యులను కోల్పోయినట్లు బాధ పడ్డారు. భారతదేశంలో సాధారణంగా పిల్లుల జీవితకాలం 14 నుంచి 16 ఏళ్ల పాటే ఉంటుంది. అయితే ఈ పిల్లి రికార్డు స్థాయిలో 21 ఏళ్ల పాటు జీవించింది. 2004 సెప్టెంబర్ 19న జన్మించిన ఈ పిల్లిని హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో నివాసం ఉంటున్న జూలూరు శ్రీదేవీ కుటుంబసభ్యులు ముద్దుగా పొట్టి అని పిలుచుకుంటూ అల్లారుముద్దుగా పెంచుకున్నారు. 2011లో ఓ అర్ధరాత్రి తాను ఛాతీ నొప్పితో అవస్థలు పడుతుంటే పక్కనే ఉన్న పొట్టి గట్టిగా అరుస్తూ కుటుంబసభ్యులను నిద్రలేపిందని, ఆసుపత్రికి తీసుకెళ్లగా గుండెపోటుగా వైద్యులు నిర్ధారించి స్టంట్ వేశారని దాని యజమాని శ్రీదేవి తెలిపారు. పొట్టి వల్లనే తాను ప్రాణాలతో బయటపడ్డాదని ఆమె చెప్పారు. ఇలా ప్రతి విషయంలో తమకు దగ్గరైన పొట్టి మృతి శ్రీదేవి కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. అంబర్‌పేట హిందూ శ్మశాన వాటికలో పొట్టి అంత్యక్రియలు నిర్వహించారు.

నూతన అక్రెడిటేషన్‌లను వెంటనే జారీ చేయండి

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్లను వెంటనే జారీ చేయాలని కోరుతూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ప్రతినిధులు సోమవారం సమాచారశాఖ కమిషనర్ ఎస్.హరీ‌ష్‌కు వినతిపత్రం అందించారు. అక్రిడిటేషన్ల మంజూరీకి నూతన మార్గదర్శకాలను రూపొందించడానికి ప్రభుత్వం నియమించిన కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి త్వరిగతిన ఇచ్చేలా చూడాలని కోరారు. స్పందించిన కమిషనర్ హరీష్.. విధి విధానాల కమిటీ సమావేశాన్ని త్వరలోనే ఏర్పాటు చేసి నూతన కార్డులను జారీ చేస్తామన్నారని టీయూడబ్ల్యూజే విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతిసాగర్, ఉపాధ్యక్షులు రమేష్ హజారీ తదితరులున్నారు.

మహిళ కడుపులో 52 ఫైబ్రాయిడ్‌ల తొలగింపు



మహిళ కడుపులో నుంచి తీసిన ఫైబ్రాయిడ్‌లు

రాయదుర్గం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ కడుపులో నుంచి 52 ఫైబ్రాయిడ్‌లను హైటెక్‌సిటీ పరిధిలోని కేర్ ఆస్పత్రి వైద్యులు తొలగించారు. కెనడాకు చెందిన సోఫియా (42) నర్సుగా పనిచేస్తున్నారు. భోజనానికి, మూత్ర విసర్జనకు కొంతకాలంగా తీవ్ర ఇబ్బంది పడుతుండడంతో కేర్ ఆస్పత్రి వైద్యులను సంప్రదించారు. ఎంఆర్ఐ తీసిన వైద్యులు ఏడు ఫైబ్రాయిడ్స్ ఉన్నట్టు గుర్తించారు. కానీ శస్త్రచికిత్స చేసే సమయంలో ద్రాక్షపండ్ల 52 ఫైబ్రాయిడ్‌లు బయటపడ్డాయి. రకరకాల సైజుల్లో ఉన్న వీటి బరువు 1.5 కిలోగ్రాములు ఉన్నట్లు డాక్టర్ ప్రభ అగర్వాల్ తెలిపారు.

హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ కమోడోర్‌గా వికాశీల్‌సింగ్ సైనీ



అల్వాల్ డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ కమోడోర్‌గా సోమవారం వికాశీల్‌సింగ్ సైనీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కమోడోర్ పంకజ్‌జైన్ స్థానంలో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. మిగ్-29, మిగ్-21, యూపీజీ, హెచ్‌జెటీ-16, హెచ్‌పీటీ-32 వంటి వివిధ యుద్ధ విమానాలతో పాటు శిక్షణా విమానాలపై 2100 గంటల కంటే ఎక్కువ సమయం నడిపిన అనుభవం ఉన్న క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా వికాశీల్‌సింగ్ సైనీకి మంచి పేరు ఉంది. లైట్ సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీమ్ సభ్యుడుగా కూడా ఆయన ఉన్నారు.

వీర సైనికుల త్యాగం అజరామరం

వీర సైనికుల త్యాగం అజరామరమని తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా (టాసా) జనరల్ ఆఫీసర్ కమాండింగ్(జీవోసీ)మేజర్ జనరల్ అజయ్ మిశ్రా అన్నారు. సోమవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో వీరుల సైనిక్ స్మారకస్తూపాన్ని ఆయన సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

వామపక్ష, బీఆర్ఎస్ ఆటో బంద్‌కు ఐకాస దూరం..

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఆర్ఎస్, వామపక్ష పార్టీ అనుబంధ సంఘాలు ఈనెల 7న నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త ఆటోబంద్‌కు భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్), అనుబంధ ఆటో సంఘం, నాన్ పొలిటికల్ జేఏసీలోని ఇతర ఐకాస ఆటో సంఘాలు దూరంగా ఉంటున్నట్లు జేఏసీ నేతలు సోమవారం తెలిపారు. ఈ మేరకు రవాణాశాఖ కమిషనర్ సురేంద్రమోహన్‌కు జేఏసీ నేతలు రవిశంకర్ అల్లూరి, యాదగిరి, నందకిషోర్ వినతిపత్రం అందజేశారు.

కూనంనేని మద్దతు కోరిన సంఘాలు

ఈనెల 7న నిర్వహించే ఆటో బంద్‌కు మద్దతునివ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును వివిధ సంఘాల జేఏసీ కోరింది. ఈ మేరకు పలువురు నేతలు సోమవారం ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు బీ.వెంకటేశ్, వీ.మారయ్య, వీ.ప్రవీణ్, ఏ.సత్తిరెడ్డి, ఉమర్‌ఖాన్ తదితరులున్నారు.

కిస్మత్‌పూర్ వద్ద మూసీలో చెత్త డంప్


చెత్తను తీసుకొచ్చిన ట్రాక్టర్

● ప్రజలు వద్దని చెప్పినా పట్టించుకోని అధికారులు

నార్సింగ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మూసీని అభివృద్ధి చేసేందుకు తగు ప్రణాళికతో ముందుకెళ్తుండగా, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది మురికికూపంగా చేస్తున్నారని కిస్మత్‌పూర్‌వాసులు ఆరోపిస్తున్నారు. ప్రతీ రోజు వందల వాహనాల్లో చెత్తాచెదారం, వ్యర్థాలను తీసుకొచ్చి కిస్మత్‌పూర్ మూసీవాగులో డంప్ చేస్తున్నారు. దుర్వాసన భరించలేక అనారోగ్యానికి గురవుతున్నామని, చెత్తాచెదారం, వ్యర్థాలను డంప్ చేయవద్దని అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్తే ఎక్కడ వేయాలని ప్రశ్నిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ సమస్యను పరిష్కరించాలని, చెత్తను డంప్ చేయకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కిస్మత్‌పూర్‌వాసులు కోరుతున్నారు.


కిస్మత్‌పూర్ మూసీ పరీవాహక ప్రాంతంలో చెత్త డంప్

ఆరాంఘర్-జూపార్కు ఫ్లైఓవర్ బ్రిడ్జికి నెహ్రూ పేరు పెట్టాలి

మదీన, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రారంభం కానున్న ఆరాంఘర్-జూపార్కు ఫ్లైఓవర్ బ్రిడ్జికి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరు పెట్టాలని బహదూర్‌పురా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్‌కుమార్ మాట్లాడుతూ, అక్కడే ఉన్న జూపార్కుకు జవహర్‌లాల్ నెహ్రూ పేరు ఉందని, ఫ్లైఓవర్‌కు కూడా నెహ్రూ పేరు పెడితే బాగుంటుందని అన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజేష్‌కుమార్


పేట్లబురుజు ఆస్పత్రిని పరిశీలిస్తున్న చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫేకర్ అలీ

మెరుగైన వైద్యం అందించాలి

● చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫేకర్ అలీ

చార్మినార్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేట్లబురుజు ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించాలని చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫేకర్ అలీ సూచించారు. పేట్లబురుజు ఆస్పత్రిని సోమవారం ఆయన సూపరింటెండెంట్ రజనిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఆస్పత్రి అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి ఇవ్వాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఆస్పత్రికి నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానన్నారు. ఇప్పటికే చార్మినార్ యునాని ఆస్పత్రికి నిధులు మంజూరు చేయించానని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థి

మంగళ్‌హాట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో న్యూజెన్ స్కూల్ విద్యార్థి సత్తాచాటాడు. తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో లాలాగూడలో తెలంగాణ రాష్ట్రస్థాయి 2024 ఓపెన్ బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో న్యూజెన్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఎం.రామ్‌చరణ్ గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా ఆయనను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు సోమవారం అభినందించారు.


రామ్‌చరణ్‌ను అభినందిస్తున్న హెచ్ఎం రవికుమార్

ఆర్చరీ విజేత చికితరావు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ ఆర్చరీ సంఘం నిర్వహించిన అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్‌లో కాంపౌండ్ విభాగంలో చికితరావు విజేతగా నిలిచింది. కొల్లూర్ డీపీఎస్‌లో జరిగిన ఈ పోటీల్లో చికిత 690 పాయింట్లతో అగ్రస్థానం సొంతం చేసుకోగా, మానస 683 పాయింట్లతో రజతం, మన్సురాహ్ కాంస్య పతకాలు సాధించారు. పురుషుల్లో శివసాయి, సాయి సుశాంత్, రాజేందర్ తొలి మూడు స్థానాల్లో నిలిచి సత్తా చాటారు. ఈ పోటీల్లో పతకాలు నెగ్గిన క్రీడాకారులు తెలంగాణ తరఫున జాతీయ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారు.


చికితరావు

కామన్వెల్త్ కరాటేలో హైదరాబాదీల సత్తా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో జరుగుతున్న కామన్వెల్త్ కరాటే చాంపియన్‌షిప్‌లో ముగ్గురు హైదరాబాదీలు పతకాలు కొల్లగొట్టారు. రామినేని రోహన్ (63 కిలోలు) క్యాడెట్ విభాగంలో స్వర్ణం, అప్రాది విశాల్ రెడ్డి (57 కి.) క్యాడెట్ విభాగంలో కాంస్యం, తాళపత్రి ఆరాధ్య (42 కి.) కుమిటేలో స్వర్ణ పతకాలు సాధించారు. టీపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కరాటే సంఘం అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, కోచ్ నరేష్ ముదావత్ ఈ ముగ్గురు క్రీడాకారులను అభినందించారు.


పతకాలతో క్రీడాకారులు

హత్య కేసులో జీవిత ఖైదు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో తోటి కార్మికుడితో గొడవపడి దాడి చేసి హత్య చేసిన వ్యక్తికి న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. పశ్చిమబెంగాల్ హరిరాంపూర్ డివిజన్ ఖోవా గ్రామానికి చెందిన రెంట హెమ్రామ్(31) పహాడిషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్ఎన్ఆర్ ఇన్‌ఫ్రాలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మద్యం మత్తులో తనతో పనిచేస్తున్న కార్మికుడితో గొడవపడ్డాడు. తాగిన మైకంలో విచక్షణారహితంగా కర్రతో కొట్టి హతమార్చాడు. కేసు నమోదు చేసుకున్న పహాడిషరీఫ్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణ చేసిన రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయసేవాధికారి నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పును వెలువరించారు.


రెంట హెమ్రామ్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మరణించగా.. మరొకరు గాయాలపాలైన సంఘటన సోమవారం మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పశ్చిమబెంగాల్‌కు చెందిన గౌరబ్(19), శివాస్ సంత్ర(42) ఆరు నెలల క్రితం గుడిమల్కాపూర్‌కు వచ్చి కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. ఏఎస్‌రావునగర్‌లో ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా సికింద్రాబాద్ ప్యాట్నీ సిగ్నల్ చౌరస్తాలో ఆర్టీసీ బస్సు కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గౌరబ్ మృతి చెందగా, శివాస్ సంత్రకు గాయలయ్యాయి. మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం పెట్టవద్దు : డీసీపీ కవిత

● సెయింట్ జోసఫ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ సెల్ 'డిజిటల్ కేర్ హబ్' ప్రారంభం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎట్టిపరిస్థితుల్లో నూ ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని, ఇది సైబర్‌నేరగాళ్ల చేతికి చిక్కి దుర్వినియోగం అయ్యే అవకాశముందని సైబర్ క్రైం డీసీపీ కవిత దార అన్నారు. కింగ్‌కోఠిలోని సెయింట్ జోసఫ్ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం వరల్డ్ కంప్యూటర్ లిటరసీ డే సందర్భంగా హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సహకారంతో 'డిజిటల్ కేర్ హబ్' పేరుతో సైబర్ సెక్యూరిటీ సెల్‌ను ప్రారంభించారు. డిజిటల్ సేఫ్టీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ వేధింపులు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ డెలివరీ మోసాలు, ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్ వంటి సైబర్ నేరాల గురించి ఉదాహరణలు చూపుతూ వివరించారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరుపై అవగాహన పెంచుకోవడంతోపాటు బలమైన పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ హెడ్ ఎం.కిరణ్‌జ్యోతి, అదనపు ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఎస్.శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపాల్ ఆంటోని సాగయరాజా, హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ అసోసియేట్ డైరెక్టర్ శీమా సిక్రీతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీపీ కవిత

గోషామహల్ పోలీస్‌గ్రౌండ్‌లో ఉస్మానియా ఆస్పత్రి వద్దు

అఫ్జల్‌గంజ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి వ్యతిరేకంగా బస్తీవాసులు చందన్‌వాడీ ఆరెకటిక భవన్‌లో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోషామహల్ పోలీస్‌గ్రౌండ్‌లో ఆస్పత్రి నిర్మిస్తే గ్రౌండ్‌కు ఆనుకుని ఉన్న గోషామహల్, పోలీస్ లైన్, చందన్‌వాడీ, హనుమాన్‌టేకిడా, ఆర్యసమాజ్ లేన్, మాల్ మైసమ్మ టెంపుల్, ఫీల్‌ఖానా, బేగంబజార్ తదితర ప్రాంతాల్లో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయన్నారు. పోలీస్ గ్రౌండ్ ఖాళీగా ఉండడం వల్లే తమ బస్తీల్లో భూగర్భ నీటి సమస్య అంతగా లేదని, ఆస్పత్రి నిర్మిస్తే కాంక్రీట్ జంగిల్‌గా మారి భూగర్భ నీటి సమస్య తలెత్తే ప్రమాదముందని పేర్కొన్నారు. బయాలజికల్ వేస్టేజ్ వల్ల అనేక వ్యాధుల బారిన పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో ఆవుల వినోద్‌కుమార్, దత్తు కోయల్కర్, లతమాణిక్, నేహాల్ న్యాయంతబద్, కోటి శైలాష్ కుర్మ, దుర్గాయాదవ్, విష్ణు, బేజిని శ్రీనివాస్, లాలాజీసరస్వతి, వకార్ చంద్రమోహన్, స్వరూప, మేకల సునీత పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న బస్తీవాసులు

ఘంటసాల ప్రతిభా పురస్కారాల ప్రదానం


ఘంటసాల పురస్కారంతో సత్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల గుండెల్లో ఘంటసాల పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.శేషశయనరెడ్డి అన్నారు. సోమవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్‌హాల్‌లో సారిపల్లి కొండలరావు సౌజన్యంతో యువకళావాహిని సంస్థ ఆధ్వర్యంలో గానగంధర్వ ఘంటసాల 102వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయనీ, గాయకులు మణిశాస్త్రి, చంద్రతేజకు ఘంటసాల ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ శేషశయనరెడ్డి పురస్కారగ్రహీతలను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఘంటసాల జయంతి సందర్భంగా పురస్కారాలు ప్రదానం చేయడం అభినందనీయమని అన్నారు. సంగీత ప్రపంచంలో ఘంటసాల చెరుగని ముద్ర వేశారని అన్నారు. సభాధ్యక్షత వహించిన రిటైర్డ్ ఐఏఎస్ డా.కేవీ రమణాచారి మాట్లాడుతూ ఘంటసాల గీతాలు వినసొంపుగా ఉంటాయని ఈతరం సంగీత దర్శకులకు ఆయన ఆదర్శప్రాయులని అన్నారు. కార్యక్రమంలో సారిపల్లి కొండలరావు, ఓలేటి పార్వతీశం, కృష్ణకుమారి, ఎస్వీ.రామారావు, లంక లక్ష్మీనారాయణ, ఎం.ఏ.హమీద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఎం డైరెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

మంగళ్‌హాట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మెడికల్ హెల్త్ రిక్రూట్‌మెంట్ సర్వీస్‌బోర్డు ప్రకటించిన ఏఎన్ఎంల పరీక్షకు సంబంధించి ఇప్పుడున్న 1931 పోస్టులకు అదనంగా పోస్టులను పెంచి, వయసురీత్యా అర్హత లేనివారికి 100 శాతం గ్రాస్ శాలరీతోపాటు రూ.10లక్షల లైఫ్ టైమ్ గ్రాట్యుటీని ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కోఠిలోని నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన రెండో ఏఎన్ఎంల ధర్నాలో ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాలుగా ఎన్‌హెచ్ఎంలో అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న వీరి సేవలను ప్రభుత్వం అనేక రకాలుగా ఉపయోగించుకుందన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో వీరి సేవలను మర్చిపోకూడదన్నారు. 18 ఏళ్ల కాంట్రాక్టు పద్ధతిన పనిచేసి చివరికి రిటైర్మెంట్ సమయంలో ఖాళీ చేతులతో ఆనెల జీతం మాత్రమే తీసుకొని ఇంటికి వెళ్లాల్సిన దయనీయమైన స్థితి కాంట్రాక్టు ఉద్యోగులకు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్ష రాసినా ఉద్యోగం రాని రెండో ఏఎన్ఎంలకు 100 శాతం గ్రాస్ శాలరీ అమలు చేయాలన్నారు. డిసెంబర్ 28 వరకు ప్రిపరేషన్ హాలిడేస్ ఇవ్వాలని, గతంలో ఇచ్చిన హామీ ప్రకారం స్టడీ మెటీరియల్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రెండో ఏఎన్ఎంల సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తోట రామాంజనేయులు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జక్కుల పద్మ, బోయిని శ్యామల, ఉపాధ్యక్షులు తస్వీర్‌సుల్తానా, కె.పద్మ, సరోజ, సహాయ కారదర్శులు లత, గోపమ్మ, సంధ్య, హారతి, గుణవతి, తులసి, రాష్ట్ర సమితి సభ్యులు సునీత, స్వాతి, గిరిజారెడ్డి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న రెండో ఏఎన్ఎంలు

జల్‌పల్లి ఆస్పత్రి నిర్మాణానికి వక్ఫ్ స్థలం కేటాయించాలి

పహాడిషరీఫ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి మున్సిపాలిటీకి మంజూరైన 30 పడకల ఆస్పత్రికి పహాడిషరీఫ్‌లో వక్ఫ్ స్థలం కేటాయించాలని కోరుతూ రంగారెడ్డి కలెక్టర్‌కు బీఆర్ఎస్ నాయకులు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. బీఆర్ఎస్ జల్‌పల్లి వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమీద్ మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సూరెడ్డి కృష్ణారెడ్డి, సయ్యద్, బర్కత్ అలీ, ఆరీఫ్, అజీమ్, సలీం పాల్గొన్నారు.

మహిళలపై హింసను అరికట్టడంలో పాలకులు విఫలం

బర్కత్‌పుర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలపైన, బాలికలపైన హింసను అరికట్టడంలో పాలకులు విఫలమయ్యారని దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గడ్డం ఆరోపించారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడారు. స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ప్రచారోద్యమ కార్యక్రమంలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో 16 రోజుల పాటు ప్రచారం నిర్వహించామని తెలిపారు.

బీఆర్ఎస్ చార్మినార్ ఇన్‌చార్జిపై చర్యలు తీసుకోవాలి

చాంద్రాయణగుట్ట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఆదేశాలను పట్టించుకోని బీఆర్ఎస్ చార్మినార్ నియోజకవర్గ ఇన్‌చార్జి సలావుద్దీన్ లోధిపై అధిష్టానం చర్యలు తీసుకోవాలని మొగల్‌పురా డివిజన్ అధ్యక్షుడు పుప్పాల రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం బేలా కాలనీలో ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పాత ఫొటోలను వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేస్తూ ఉద్యమకారుల మనోభావాలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు మణికొండ విజయ్ కుమార్, తిరుపతి నాగరాజు, మహ్మద్ అమీర్, పంకజ్ షిండే తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులపై దృష్టి సారించాలి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందించే దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. గ్రీవెన్స్‌సెల్‌లో వివిధ సమస్యలపై 332 మంది దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటాచారి, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరాం పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీలో 132 దరఖాస్తులు

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు ఆరు జోన్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 132 దరఖాస్తులు వచ్చాయి. జీహెచ్ఎంసీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగానికి 17, ఏసీ రెవెన్యూ, అడ్మిన్‌కు 4, సీఈ మెయింటనెన్స్ వెటర్నరీ, ఎల్ఏఓకు 3, శానిటేషన్, హెల్త్, యూబీడీసీఈ ప్రాజెక్టుకు-1 ఆర్జీలు చేసుకున్నారు. అలాగే ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 6 వచ్చాయి. మరికొన్ని విభాగాలకు దరఖాస్తులు అందజేశారు. కాగా, వీటితోపాటు జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 94 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

పార్ట్‌టైం జాబ్ పేరుతో మోసం

● నగరవాసి నుంచి రూ.1.65 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పార్ట్‌టైం జాబ్ అంటూ నగరవాసిని మభ్యపెట్టిన సైబర్ నేరగాళ్లు పలు దఫాలుగా పెట్టుబడి పెట్టించి రూ.1.65 లక్షలు కాజేశారు. పార్ట్‌టైం ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో వెతికిన నగరానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి (44)ని సైబర్ నేరగాళ్లు సంప్రదించారు. తాము మైండ్ డిజిటల్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులమని చెప్పుకున్నారు. టాస్కుల పేరుతో గూగుల్ మ్యాప్స్‌లో రేటింగ్ ఇస్తే డబ్బులు ఇస్తామని చెప్పారు. నమ్మకం సాధించేందుకు ఒక్కో టాస్క్ పూర్తి చేస్తే రూ. 150 చొప్పున ఇచ్చారు. తర్వాత వీఐపీ టెలిగ్రాం గ్రూపులో చేర్చారు. అధిక సంపాదన కోసం రూ.2 వేలు పెట్టుబడి పెట్టి టాస్కులు పూర్తి చేసే రూ.2800, అలాగే రూ.5 వేలు పెట్టుబడి పెట్టి టాస్కులు పూర్తిచేస్తే రూ.6500, రూ.33 వేలు పెట్టుబడి పెట్టి టాస్కులు పూర్తి చేస్తే రూ.49,500 ఇస్తామని చెప్పారు. దాంతో అధిక ఆదాయం కోసం రూ.33 వేలు సైబర్ నేరగాళ్లకు చెల్లించాడు. పూర్తి చేసిన టాస్కుల్లో తప్పులు ఉన్నాయని, డబ్బు ఇవ్వడం కుదరదని చెప్పిన సైబర్ నేరగాళ్లు ఈ డబ్బు రావాలంటే మరింత పెట్టుబడులు పెట్టాలని సూచించారు. ఇలా పలుమార్లు బాధితుడి నుంచి రూ.1.65 లక్షలు వసూలు చేశారు. ఎన్ని సార్లు డబ్బులు పెట్టినా మళ్లీ డబ్బులు డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.


ఎస్సీ సంక్షేమశాఖ అధికారి యాదయ్యను సన్మానిస్తున్న కలెక్టర్

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే తప్పకుండా గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి పెరిక యాదయ్య ఉద్యోగ విరమణ సమావేశం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 34 ఏళ్లపాటు ఎస్సీ సంక్షేమ శాఖలో పనిచేసి నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి యాదయ్య ఎంతో కృషి చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు, పదవీవిరమణ సాధారణమన్నారు. వృత్తి నిబద్ధతతో పనిచేసే అధికారులు చిరకాలం గుర్తుంటారని చెప్పారు. అనంతరం కలెక్టర్‌తోపాటు వివిధ శాఖల అధికారులు యాదయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరివన్, ముకుందరెడ్డి, వెంకటాచారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


అబ్దుల్ మోయిజ్‌ను సన్మానిస్తున్న గిరిధర్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు

సెట్విన్ జీఎం ఉద్యోగ విరమణ

చార్మినార్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సంస్థలోనూ, ప్రజల్లోనూ ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి అన్నారు. సెట్విన్ జీఎం మహ్మద్ అబ్దుల్ మోయిజ్ ఉద్యోగ విరమణ సభ సోమవారం పురానిహవేలిలోని ప్రధాన కార్యాలయంలో జరిగింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ ఎకౌంట్స్ ఆఫీసర్ సురేష్‌బాబు, సూపరింటెండెంట్ రాధాకృష్ణ, నవీన్ కుమార్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను ఏబీవీపీ నాయకులు సభావట్ కల్యాణ్, దిలీప్ ప్రజాపతి సోమవారం కలిశారు. విద్యారంగ సమస్యలపై చర్చించారు. సిటీ కళాశాల విద్యార్థులకు వసతి గృహాలు ఏర్పాటు చేయాలని కోరారు.
● చార్మినార్, ఆంధ్రజ్యోతి

12న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా

బర్కత్‌పుర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో జనగణనలో కులగణన చేపట్టాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు డిమాండ్ చేశారు. కులగణన ద్వారానే బీసీలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 11న ఢిల్లీలోని కనిస్టిట్యూషన్ క్లబ్‌లో ఓబీసీ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 12న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పలు సంఘాల నేతలు చామకూర రాజు, కె.వి.గౌడ్, శ్రీకాంత్, బత్తుల సిద్దేశ్వర్, నరేందర్, సూర్యారావు, వేణు, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌పటేల్, నరహరి పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి

మదీన, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హుస్సేనిఆలం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పియ చిన్నమ్మ అన్నారు. కళాశాలలో సోమవారం వరల్డ్ హెచ్ఐవీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శ్రీదేవి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లత, అధ్యాపకులు సునీత, జంతుశాస్త్ర విభాగం అధ్యాపకులు ఎం.ప్రణీత, ఎస్.అనిత, కె.శైలజ, కె.ఈశ్వర్, రజని, జెస్సి, స్వప్న పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం : బీజేపీ

రాజేంద్రనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ నాయకులు ఆరోపించారు. సోమవారం ఉప్పర్‌పల్లిలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో వెంకట్‌రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మైలార్‌దేవపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన 66 హామీలు ప్రజలను మోసపరిచేవిగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అత్తాపూర్ కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరీశంకర్, బీజేపీ రాష్ట్ర నాయకులు టి.అంజన్‌కుమార్‌గౌడ్, బుక్క వేణుగోపాల్, రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి పొన్నమోని మల్లేష్ యాదవ్, జిల్లా నాయకులు ఎన్.మల్లారెడ్డి, ఎం.కొమురయ్య, లక్ష్మీనారాయణ, బొక్క బాల్‌రెడ్డి, షాబాద విజయ్‌కుమార్, అడికె జనార్దన్, మహేష్ యాదవ్, భిక్షపతి యాదవ్, ఎ.భీమార్జున్‌రెడ్డి, జోగి రవి, డి.సత్యనారాయణ, సులిగె వెంకటేష్, ప్రశాంత్‌నాయక్, భువనేశ్వర్ పాల్గొన్నారు.

తాత్కాలిక అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

చార్మినార్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సిటీ కళాశాల(అటానమస్) స్టాటిస్టిక్స్ విభాగంలో తాత్కాలిక అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తు, అర్హతల ఒరిజినల్ ధ్రువపత్రాలతో డిసెంబరు 4వ తేదీన ఇంటర్వ్యూకి హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ పి.బాలభాస్కర్ తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాల కోసం డి.శ్రవణ్ కుమార్ (98482 74530)ని సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రముఖులకు ఎర


మూతబడిన త్రితియ జువెలరీ షోరూమ్

- ప్రారంభోత్సవాల పేరుతో హడావిడి
- సినిమావారిని ముంచేసిన కాంతిదత్
- పోలీసుల విచారణలో అనేక విషయాలు వెలుగులోకి

హైదరాబాద్ సిటీ/బంజారాహిల్స్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజంలో సినీ సెలబ్రిటీలంటే ఎంతో క్రేజ్.. వారు ఏదైనా ప్రారంభోత్సవానికి వస్తున్నారంటే.. చూడటానికి వేలాది మంది అభిమానులు తరలివస్తారు. సినీ ప్రముఖులే మెచ్చుకునే హోదా ఉంటే.. వారే మన పరిచయం కోసం వెంటబడే స్థాయి ఉంటే.. సెలబ్రిటీగా గుర్తింపు వస్తుంది. అది నిజం చేసుకోవాలని పథకం వేశాడు కాంతిదత్. త్రితియ జువెలరీ ట్రేడింగ్ పేరుతో రూ. వందకోట్లకు పైగా కొల్లగొట్టిన కాంతిదత్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. అతడిని విచారించగా.. అనేక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. విశాఖపట్నానికి చెందిన కాంతిదత్ పదోతరగతి చదివాడు. వ్యాపారం చేసి డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో హైదరాబాద్ వచ్చాడు. తన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఐదేళ్ల క్రితం సోషల్ సర్వీస్ పేరుతో ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టాడు. ఆ ర్యాలీకి ప్రముఖ డిజైనర్‌ను ఆహ్వానించాడు. ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. తన మాటలతో ఆమెను ఆకర్షించాడు. కొంత డబ్బు సమకూర్చుకున్న తర్వాత సస్టెయిన్ కార్ట్ పేరుతో కంపెనీని ప్రారంభించాడు. దాని ప్రారంభోత్సవానికి ఆమెతో పాటు.. ఆమెకు పరిచయం ఉన్న సినీ సెలబ్రిటీలను పిలిచాడు. అందుకు వారికి తగిన పారితోషికం ఇచ్చాడు. ఆ సమయంలో తానొక బడా వ్యాపారవేత్తగా పరిచయం చేసుకున్నాడు. తన కంపెనీలో 1100 బ్రాండ్స్ ఉన్నాయని, దేశవ్యాప్తంగా విస్తరింపజేస్తున్నట్లు నమ్మించాడు. పెట్టుబడి పెట్టిన వారికి అత్యధిక లాభాలు వస్తాయని, కంపెనీ షేర్స్ విలువ అత్యధికంగా ఉన్నట్లు నమ్మించి అరచేతిలో వైకుంఠం చూపించేవాడు. ప్రమోషన్స్ పేరుతో అనేక మంది సెలబ్రిటీలను పిలవడం, వారితో పరిచయాలు పెంచుకొని తన డాబు, దర్పాన్ని ఎరగా వేశాడు. అదంతా సెలబ్రిటీలు నిజమని నమ్మడంతో అతడిని అందరూ సెలబ్రిటీలకే సెలబ్రిటీగా గౌరవించేవారు.

పెట్టుబడి పేరుతో..

ప్రమోషన్ కార్యక్రమాలకు, ప్రారంభోత్సవాలకు వచ్చిన ప్రముఖులు అతడి మాటలు నమ్మి.. తన కంపెనీలో పెట్టుబడి పెట్టే స్థితికి తీసుకొచ్చేవాడు. అలా ప్రమోషన్‌కు వచ్చిన వారు కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టేవారు. కొద్దిరోజుల తర్వాత సస్టెయిన్ కార్ట్ కంపెనీని మూసేసి త్రితియ జువెలరీ గోల్డ్ ట్రేడింగ్ వ్యాపారాన్ని ప్రారంభించాడు. అలా సినీ సెలబ్రిటీలతో పాటు.. వేలాదిమంది ఇన్వెస్టర్లను ఆకర్షించి రూ. 100 కోట్లకు పైగా కొల్లగొట్టాడు. కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టిన ఓ ఫ్యాషన్ డిజైనర్ కాంతిదత్ కంపెనీలో డైరెక్టర్ పదవి దక్కించుకుంది. ఆమె ద్వారా అతడికి అదృష్టం కలిసి రావడంతో అంగీకరించాడు. కాంతిదత్ చేసేది మోసమని, లాభాలు ఏమీ లేవని కొద్దిరోజుల్లోనే ఆమె గుర్తించింది. కంపెనీ లావాదేవీలపై ప్రశ్నించడంతో నకిలీ పత్రాలు సృష్టించి డైరెక్టర్ పదవి నుంచి ఆమెను తప్పించి, సంతకం ఫోర్జరీ చేసి కొత్తవారిని డైరెక్టర్‌గా తీసుకున్నాడు. ఈ విషయం తెలిసిన సదరు డైరెక్టర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి అతడి కదలికలపై దృష్టి పెట్టిన పోలీసులు కాంతిదత్‌ను అరెస్ట్ చేశారు.

త్రితియ జువెలరీ షోరూమ్‌కు తాళం

కాంతిదత్ అరెస్ట్ కావడంతో జూబ్లీహిల్స్‌లో ఆయన ఏర్పాటు చేసిన త్రితియ జువెలరీ షోరూం మూత పడింది. షోరూమ్‌ను సోమవారం తెరవకపోవడంతో పెట్టుబడిదారుల్లో ఆందోళన మొదలైంది. కాంతిదత్ కుటుంబ సభ్యులను సంప్రదించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఎలా ముందుకెళ్లాలో అర్థంకాక సతమతమవుతున్నారు.


చిన్నారుల నాట్య ప్రదర్శనను తిలకిస్తున్న గవర్నర్ దంపతులు

రాజ్‌భవన్‌లో అసోం రాష్ట్ర అవతరణ దినోత్సవం

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజ్‌భవన్‌లో అసోం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దర్బార్ హాల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర ప్రథమ మహిళ సుధాదేవ్ వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అసోం రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య వీడియో కాన్ఫరెన్స్‌లో తన సందేశం వినిపించారు. తెలంగాణ రాష్ట్రంలో స్థిరపడ్డ అసోం రాష్ట్ర ప్రముఖులు, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఇతర అధికారులు పాల్గొన్నారు.


చిన్నారికి పుట్టినతేదీ ధ్రువపత్రం అందజేస్తున్న కలెక్టర్

శిశువిహార్ పిల్లలకు మెరుగైన వైద్యం అందించండి

- వైద్యాధికారులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శిశువిహార్‌లోని పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్యాధికారులను ఆదేశించారు. మధురానగర్ శిశువిహార్ సంరక్షణ కేంద్రంలో సోమవారం స్వచ్ఛంద సంస్థలు, శిశు విహార్‌లో ఉంటున్న పిల్లలకు పుట్టినతేదీ, కులం, ఇతర ధ్రువీకరణ పత్రాల జారీ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపును కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన 8 నెలల చిన్నారికి బర్త్ సర్టిఫికెట్ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆయా కేంద్రాల్లోని పిల్లలకు వారం రోజుల్లోగా ధ్రువీ కరణ పత్రాలు జారీ చేయాలన్నారు. సంరక్షణ కేంద్రంలోని పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పిల్లల తల్లిదండ్రులు చనిపోతే వారి ఆస్తులు అందేలా రెవెన్యూ శాఖకు వివరాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి అక్కేశ్వరరావు, సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం, డీసీపీఓ శ్రీనివాస్, తహసీల్దార్ నయీమొద్దీన్, బాలరక్ష భవన్ కో-ఆర్డినేటర్ సుమలత, యునిసెఫ్ స్టేట్ కో-ఆర్డినేటర్ డేవిడ్, సీడీపీఓ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్లమెంటు శీతాకాల సమావేశాలను నగరంలో నిర్వహించాలి

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

న్యూఢిల్లీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు శీతాకాల సమావేశాలను హైదరాబాద్‌లో నిర్వహించాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ డిమాండ్ చేశారు. దక్షిణాదిని పట్టించుకోకపోతే ప్రత్యేక దేశం కోసం పోరాడే పరిస్థితి వస్తుందని అన్నారు. దక్షిణాదికి న్యాయం జరగడం లేదన్నారు. కాలుష్యం ఇబ్బంది పెడుతున్నా పార్లమెంట్ సమావేశాలు ఢిల్లీలోనే నిర్వహిస్తున్నారని విమర్శించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ పోర్టు నుంచి బియ్యం అక్రమ రవాణాపై సీబీఐ దర్యాప్తు చేయాలన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఆపేందుకు ప్రధాని నరేంద్రమోదీ జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. జనసేనను బీజేపీలో విలీనం చేసే పని జరుగుతోందని, అందుకే పవన్‌కల్యాణ్ సనాతనం, లడ్డూల గురించి మాట్లాడుతున్నారని కేఏ పాల్ విమర్శించారు.

సైన్స్, ఆర్ట్, ఎంపతి కలయిక వైద్యం

- అపోలో అండర్ గ్రాడ్యుయేషన్ కాన్వొకేషన్‌లో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'ప్రపంచం వేగంగా మారుతోంది, ఉన్నచోటనే ఉంటే వెనుకబడిపోతారు. మెడిసిన్‌లో తెలియని సమస్యలు చాలా ఉంటాయి, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం వలే జీవశాస్త్రం ఎప్పుడూ పరిపూర్ణంగా ఉండదు.. అనేక క్లిష్ట సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని' ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సోమవారం జూబ్లీహిల్స్‌లోని ఆర్ఎస్ఆర్ ఆడిటోరియంలో అండర్ గ్రాడ్యుయేట్ బ్యాచ్-2018 విద్యార్థులకు కాన్వొకేషన్ వేడుకను నిర్వహించింది. ముఖ్య అతిథిగా డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డి, గౌరవ అతిథిగా అపోలో ఆస్పత్రుల గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి, డీన్ డాక్టర్ కె. మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. వైద్యం అనేది సైన్స్, ఆర్ట్, ఎంపతి కలయిక అని, ఈ మూడింటిని కలిపితేనే పరిపూర్ణ వైద్యులవుతారని అన్నారు. మంచి వైద్యుడి నుండి గొప్ప వైద్యుడు కావాలంటే, కమ్యూనికేషన్ కళలో ప్రావీణ్యం పొందాలని, అది పేషెంట్లు, అటెండర్లు, సహోద్యోగులు, మీడియా మొదలైనవి అని, గొప్ప డాక్టర్ కావడానికి ఇది నేర్చుకోవడం చాలా అవసరమన్నారు. ఒంటరిగా తనకు ఉపయోగపడే పనులు మానేసి సమాజానికి మరింత మేలు చేయాలనేది నాన్నగారి సలహా అని, ఆ రోజు తన దృక్పథాన్ని మార్చుకుని సంస్థలు నిర్మించడం, పేదలకు సహాయం చేయడం లాంటివి చేయడం మొదలుపెట్టానని వివరించారు. తాను మెడిసిన్ పాసైనప్పుడు, తన ఐకాన్‌లలో ఒకరైన డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి, ఆయన ఆత్మకథ 'ది హీలర్' చదవాలని విద్యార్థులకు సూచించారు. వైఫల్యాలే విజయానికి సోపానాలని గుర్తుంచుకోవాలన్నారు.


అపోలో అండర్ గ్రాడ్యుయేట్ కాన్వొకేషన్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సంగీతారెడ్డి

ఈ సందర్భంగా వందమంది అండర్ గ్రాడ్యుయేట్లు పట్టాలు అందుకున్నారు. అపోలో మెడికల్ కాలేజీలో 2012 నుంచి ఇప్పటి వరకు 700 మంది విద్యార్థులు పట్టభద్రులయ్యారని నిర్వాహకులు తెలిపారు. ఉత్తమ అవుట్‌గోయింగ్ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థి సిద్ధాంత్ బర్మేచాకు డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి బంగారు పతకాన్ని ప్రదానం చేశారు.

కేన్సర్‌పై విస్తృత పరిశోధనలు అవసరం

- నిమ్స్‌లో కేన్సర్ నెక్ట్స్ సదస్సులో వైద్యులు


మాట్లాడుతున్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేన్సర్‌కు చెక్ పెట్టడానికి విస్తృత పరిశోధనలు, ఆధునిక వైద్య ప్రక్రియలు అవసరమని ఆంకాలజిస్టులు అభిప్రాయపడ్డారు. రాబోయే పదేళ్లలో కేన్సర్ కేసులు మరిన్ని పెరిగే ముప్పు ఉందని, ఆ దిశగా పరిశోధకులు దృష్టి సారించాలని, చికిత్స విధానాలను మెరుపర్చాల్సిన అవశక్యత ఉందన్నారు. నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) 'క్యాన్సర్ నెక్ట్స్-2024'అంశంపై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. అంకాలజీ యువ వైద్యులు, యువ శాస్త్రవేత్తలు, ఇతర విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొన్నారు. మాలిక్యులర్ పాత్‌వేస్ నుంచి అడ్వాన్స్‌డ్ డయాగ్నస్టిక్స్ వరకు పలు అవశాలపై చర్చించినట్లు మెడికల్ అంకాలజీ యూనిట్ ప్రొఫెసర్ సదాశివుడు వివరించారు. కేన్సర్ పరిశోధనను అభివృద్ధి చేయడంలో నిమ్స్ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

'మహా' అభివృద్ధికి అంకురార్పణ

(7వ పేజీ తరువాయి)

(సంప్ తరహా నిర్మాణం) చేపడుతున్నారు. సచివాలయం ఎదురుగా, లేక్ వ్యూ గెస్ట్‌హౌస్ తదితర ప్రాంతాల్లో నాలుగు నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. వీటిని సీఎం ప్రారంభించనున్నారు. నేడు ప్రారంభం కానున్న విజయోత్సవాలు 9వ తేదీన ముగియనున్నాయి. ముగింపు వేడుకలను ట్యాంక్‌బండ్‌పై నిర్వహించనున్నారు. ఇందుకోసం జీహెచ్‌ఎంసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.

నగర ఖ్యాతి.. ప్రపంచానికి చాటేలా...

గ్రేటర్ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. హైదరాబాద్ రైజింగ్ పేరిట భాగ్యనగర ఖ్యాతిని ప్రపంచానికి చాటేలా అభివృద్ధి చేయడంతోపాటు పలు కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా నగరంలో భారీ ఎత్తున పురపాలక శాఖ ప్రాజెక్టులు చేపడుతోంది. జంక్షన్ల వద్ద సిగ్నల్ చిక్కులు లేకుండా వంతెనలు, అండర్ పాస్‌లు, రైల్వే ట్రాక్‌ల వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ), రోడ్ అండర్ బ్రిడ్జి (ఆర్‌యుబీ)లు, గ్రేడ్ సెపరేటర్ల నిర్మాణం, రహదారుల విస్తరణ పనులు చేపట్టేందుకు రంగం సిద్ధం చేశారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఐటీ కారిడార్‌కు వెళ్లే క్రమంలో కేబీఆర్ పార్కు చుట్టూ జంక్షన్ల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ ఇబ్బందులకు చెక్ పెట్టేలా పార్కు చుట్టూ ఉన్న జంక్షన్లలో గ్రేడ్ సెపరేటర్లు, అండర్‌పాస్‌లను నిర్మించనున్నారు. రూ.580 కోట్లతో ప్రతిపాదించిన పనులకు ప్రభుత్వం ఇప్పటికే పాలనాపరమైన అనుమతులు జారీ చేసింది. ఐటీ కారిడార్‌లోని ఖాజాగూడ, ఐఐఐటీ, విప్రో జంక్షన్‌ల వద్ద మల్టీ లెవల్ ఫ్లై ఓవర్, గ్రేడ్ సెపరేటర్లు నిర్మించనున్నారు. అమీన్‌పూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో రహదారుల విస్తరణ పనులకు శంకుస్థాపన జరగనుంది. అంతర్జాతీయ విమానాశ్రయానికి మరింత సులువుగా, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వెళ్లేలా కాటేదాన్, ఆరాంఘర్ జంక్షన్‌లో గ్రేడ్ సెపరేటర్, ఆర్‌యూబీ నిర్మించనున్నారు.

కార్లను అద్దెకు తీసుకొని టోకరా

- కిలా(లే)డీ ముఠా అరెస్ట్
- రూ. 2.50 కోట్ల విలువైన 21 కార్లు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కార్ల యజమానులకు టోకరా వేసి లక్షల రూపాయలు కొల్లగొడుతున్న ముఠా ఆటకట్టించారు రాయదుర్గం పోలీసులు. మహిళా గ్యాంగ్ లీడర్ సహా.. ముఠాలోని నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 2.50కోట్ల విలువైన 21 కార్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం గచ్చిబౌలిలో జరిగిన విలేకరుల సమావేశంలో మాదాపూర్ డీసీపీ వినీత్ వివరాలు వెల్లడించారు.

గచ్చిబౌలి టెలికాం నగర్‌కు చెందిన జూపూడి ఉష గృహిణి. ఆమె భర్త ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్. అనారోగ్య కారణాలతో కొంతకాలం క్రితం మృతి చెందాడు. సులభంగా డబ్బు సంపాదించాలని పథకం వేసిన ఆమె.. తన వద్ద డ్రైవర్‌గా పనిచేసిన మల్లేష్‌తో కలిసి కార్ల దందాకు శ్రీకారం చుట్టింది. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన సాగర్‌పాటిల్, భాల్కికి చెందిన జమానే అనిల్‌కుమార్‌తో ముఠాగా ఏర్పడ్డారు.

జీపీఎస్ తొలగించి..

కార్లను కిరాయికి తిప్పుతామని, నెలనెల అద్దె చెల్లిస్తామని తెలిసిన వారి ద్వారా ప్రచారం చేశారు. కొంతమంది కార్ల యజమానులను నమ్మించి 21 కార్లు అద్దెకు తీసుకున్నారు. కొద్దిరోజుల తర్వాత వాహనాలను కర్ణాటక రాష్ట్రం తరలించారు. కార్లకు అమర్చిన జీపీఎస్‌ను తొలగించి, యజమానుల వద్ద తీసుకున్న ధ్రువపత్రాలతో కర్ణాటకలోని పలు నగరాల్లో అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. కార్ల యజమానులకు అద్దె చెల్లించకపోవడంతో వారు నిలదీశారు. మీ వద్ద తీసుకున్న కారు చోరీ అయిందని, పోలీసులకు ఫిర్యాదు చేశామని, దొరకగానే కారుతోపాటు అద్దె చెల్లిస్తామని బురిడీ కొట్టించేవారు.


స్వాధీనం చేసుకున్న కార్లను చూపిస్తున్న డీసీపీ వినీత్, ఏసీపీ శ్రీకాంత్

సంపాదించి.. అప్పులు తీర్చుకొని..

ఉష చెబుతున్న మాటలతో అనుమానం వచ్చిన కొంతమంది కార్ల యజమానులు రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, డీసీపీ వినీత్ ఆదేశాలతో ఏసీపీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సతీష్ టీమ్ రంగంలోకి దిగింది. ఆమె ముఠాను అదుపులోకి తీసుకొని విచారించగా.. అసలు మోసం వెలుగులోకి వచ్చింది. అద్దెకు తీసుకున్న కార్లను కర్ణాటకకు తరలించి అద్దెకు తిప్పుతూ నెలరోజుల్లోనే రూ. 60 లక్షలకు పైగా సంపాదించినట్లు తేలింది. కార్ల యజమానులకు అద్దె ఇవ్వకుండా రూ. 20 లక్షల అప్పులు తీర్చుకుంది. ముఠాలో కీలకంగా వ్యవహరించిన డ్రైవర్ సొంతింటి నిర్మాణానికి ఖర్చు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. పోలీసులు 21 కార్లను స్వాధీనం చేసుకున్నారు. కిలేడీ ముఠాను పట్టుకున్న రాయదుర్గం పోలీసులను సీపీ అవినాష్ మహంతి అభినందించారని డీసీపీ వినీత్ తెలిపారు.

ఆ పెళ్లిళ్ల రూల్సే వేరయా!

(7వ పేజీ తరువాయి)

ఉంటే ఖురేషీ బిరాదరీ (సంఘం) నియమ నిబంధనలను ఉల్లంఘించడమే. అందుకు తగిన శిక్షనూ ఎదుర్కోవాల్సిందే. అదే వలీమాలో అబ్బాయి కుటుంబం విందు భోజనాలు ఎంత ఘనంగా నిర్వహించినా అభ్యంతరం లేదని, కేవలం అమ్మాయి కుటుంబానికే ఈ షరతు వర్తిస్తుందని సంఘానికి చెందిన అక్రమ్ ఖురేషీ తెలిపారు. ఏదేమైనా, ఈ నిబంధన ఖురేషీ కమ్యూనిటీలోని అమ్మాయిల తల్లిదండ్రులకు పెద్ద ఊరటే. పెళ్లి చేసి అప్పుల పాలు కానవసరం లేకుండా ఒక మంచి మార్గాన్ని ఆశ్రయించడం గొప్ప విషయమే.. కాదు ఆదర్శనీయం కూడా కదా!

కట్నంలేని పెళ్లిళ్లకు ఈ వేదిక ఉచితం

ఇదివరకు పెళ్లిళ్ళకు ఇంటిముందు పందిరి వేసేవారు. ఇరుగు పొరుగు ఇళ్లు విడిది అయ్యేవి. ఇప్పుడలా సాధ్యమా! నగరంలో పెళ్లి ముహూర్తానికన్నా ముందు ఫంక్షన్ హాల్ (వివాహ వేదిక)ను నిర్ణయించుకోవడం ముఖ్యం. వాటి అద్దె స్థాయిని బట్టి వేల నుంచి లక్షల్లో ఉంటుంది. ఇదే పెళ్లి ఖర్చులో సింహభాగం అవుతుంది. అలాంటిది నగరం నడిబొడ్డున మెహిదీపట్నంలో రోజుకు వేల రూపాయల అద్దె వచ్చే తన అమాన్ ఎయిర్ కండిషన్డ్ ఫంక్షన్ హాల్‌ను వివాహ వేడుకలకు సోషియో రిఫార్మ్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఆజ్మత్ ఉల్లా ఖాన్ ఉచితంగా ఇస్తున్నారు. అయితే ఆడపిల్ల కుటుంబం నుంచి కట్నకానుకలు తీసుకోని వారికి మాత్రమే ఈ అవకాశమని తెలిపారు. ఇంకొన్ని షరతులు కూడా ఉన్నాయి. ఆ వివాహ వేడుకల్లో సంగీత, నృత్య కార్యక్రమాలు, మద్యం పార్టీలను అనుమతించరట. ముస్లింలకే కాదు, హిందు, క్రిస్టియన్.. ఎవరైనా సరే, తమ షరతులకు అనుగుణంగా వివాహ వేడుకలు చేసుకునేవారికి ఫంక్షన్ హాల్‌ను ఉచితంగా ఇస్తామని నిర్వాహకులు ప్రకటించారు. నిఖా జరిగిన రోజే వలీమా చేసుకోవాలన్నది ముస్లింలకు మాత్రమే వీరు విధించిన షరతు. వీడియోగ్రాఫర్లను అనుమతించరు. 2019 నుంచి ఇప్పటి వరకు ఎంతోమందికి ఫంక్షన్ హాల్‌ను ఉచితంగా కేటాయించినట్లు వారు తెలిపారు.


ప్రజలతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

రసాయన నాలాపై అక్రమ నిర్మాణాలు

- పరిశీలించిన హైడ్రా కమిషనర్

బేగంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రకాశ్‌నగర్ స్లమ్ పక్కన ఉన్న రసాయన నాలాపై అక్రమ నిర్మాణాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ సోమవారం పరిశీలించారు. కొందరు నకిలీ పత్రాలు సృష్టించి నిర్మాణాలు చేశారనే ఫిర్యాదులు హైడ్రాకు అందడంతో పలు విభాగాల అధికారులతో రంగనాథ్ ఆ ప్రాంతంలో పర్యటించారు. అక్కడ నిర్మించిన షెడ్లతోపాటు జలమండలికి చెందిన పాత మ్యాప్‌లను పరిశీలించారు. సుమారు 40 సంవత్సరాల క్రితం బాలానగర్ నుంచి అంబర్‌పేట వరకు కెమికల్ నాలా ఉండేదని, ఇటీవల కొందరు నకిలీ ఇంటి నంబర్లతో నిర్మాణాలు చేశారని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిసింది. తాత్కాలిక నిర్మాణాలు చేసిన వారు హైడ్రా కమిషనర్‌ను కలిసి మాట్లాడారు. ఇక్కడ నాలా ఉందా - లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. రసాయన నాలా ఉందని వారు ఆయనకు చెప్పారు. నిర్మాణదారులు పత్రాలు చూపించేందుకు యత్నించగా.. కార్యాలయంలో ఇవ్వాలని వారికి సూచించారు. కొందరు జీహెచ్‌ఎంసీ నుంచి లక్షల్లో టీడీఎస్ బాండ్లు తీసుకొని అమ్ముకున్నారని పలువురు రంగనాథ్‌కు తెలిపారు. ఇక్కడి నిర్మాణాలకు జీహెచ్‌ఎంసీ గతంలో పలుమార్లు నోటీసులు జారీ చేసింది.

ఆధునిక వ్యవసాయ ల్యాబ్‌లకు ఎస్‌బీఐ సహాయం


ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టిని కలిసిన వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య

రాజేంద్రనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఎస్‌బీఐ సీఎస్ఆర్ నిధులతో అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌తోపాటు ఆధునిక వ్యవసాయ ల్యాబ్ ఏర్పాటు ఆర్థిక సహాయం అందిస్తామని ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసుల శెట్టి తెలిపారు. ఆయనను సోమవారం ముంబైలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాసులు శెట్టి రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థి కావడం గమనార్హం. ఈనెల 21, 22 తేదీల్లో జరగనున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలలో పాల్గొనాలని ప్రొఫెసర్ జానయ్య శ్రీనివాసులు శెట్టిని ఆహ్వానించారు. సమావేశంలో వర్సిటీ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జెల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

చావాలనుకుంటే యూ కెన్ డూ ఇట్

(7వ పేజీ తరువాయి)

ఉండగానే శోభిత ఆత్మహత్య చేసుకోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి 10గంటల సమయంలో భోజనం చేసిన అనంతరం శోభిత బెడ్‌రూమ్‌లోకి వెళ్లింది. భర్త సుధీర్ హాల్లోనే ఉండి ఆఫీస్ వర్క్ చేసుకుంటూ అక్కడే నిద్రపోయినట్లు చెబుతున్నాడు. ఉదయం పనిమనిషి వచ్చి శోభిత నిద్రిస్తున్న గది తలుపు తట్టింది. తలుపులు తీయకపోవడంతో నిద్రిస్తోందని గంటసేపు వేచి చూసి మళ్లీ తలుపు తట్టారు. అప్పటికీ తీయకపోవడంతో తలుపులు బద్దలుకొట్టి తెరిచారు. పోస్టుమార్టం రిపోర్టులో కూడా శోభితది ఆత్మహత్య అని తేల్చినట్లు సమాచారం. ఒంటిపై గాయాలేమీ లేవు. ఆత్మహత్య చేసుకునే ముందు శోభిత తన సోదరితో ఫోన్‌లో మాట్లాడింది. తాను సంతోషంగానే ఉన్నట్లు ఆమెతో చెప్పినట్లు సమాచారం. మరి ఎందుకు ఆత్మహత్య చేసుకుంది అనేది తెలియాల్సి ఉంది. పోలీసులు శోభిత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. బెంగుళూరుకు తరలించి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సమాచారం.

ఆత్మహత్య చేసుకుందంటే నమ్మలేకపోతున్నాం

అఫ్జల్‌గంజ్/మంగళ్‌హాట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శోభిత మృతదేహానికి ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. ఆమె మరణవార్త తెలిసిన వెంటనే బెంగుళూరు నుంచి ముగ్గురు అక్కలు, తమ్ముడు, ఇతర కుటుంబసభ్యులు ఇక్కడకు చేరుకున్నారు. తుక్కుగూడలోని భర్త సుధీర్‌రెడ్డి, బాబాయిలు నాయిని బుచ్చిరెడ్డి, చింతల వెంకట్‌రెడ్డి ఇతర కుటుంబసభ్యులు కూడా వచ్చారు. పరస్పర అంగీకారంతో శోభిత అంత్యక్రియలు బెంగళూరులో చేయాలని నిర్ణయించారు. శోభిత మామ బుచ్చిరెడ్డి, చింతల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆమె అందరితోనూ కలుపుగోలుగా ఉండేదని, ఆత్మహత్య చేసుకుందంటే ఇప్పటికీ నమ్మలేక పోతున్నామని తెలిపారు. దంపతులు అన్యోన్యంగా ఉండేవారని, ఇటీవలే గోవాకు వెళ్లి వచ్చారని తెలిపారు. శోభిత మృతితో తమ కుమారుడు ఇంకా షాక్‌లోనే ఉన్నాడని, కోలుకోవడానికి కొంత సమయం పడుతుందని బుచ్చిరెడ్డి తెలిపారు.

రోడ్లపై అంధకారం

(7వ పేజీ తరువాయి)

ఎల్‌ఈడీ లైట్లు మార్చారు. ఏర్పాటు, ఏడేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలను ఈఈఎస్ఎల్‌కు అప్పగించారు. గతంలో నెలకు రూ.14 కోట్ల నుంచి రూ.15 కోట్లకుపైగా జీహెచ్‌ఎంసీ వీధి దీపాలకు విద్యుత్ బిల్లు చెల్లించేది. ఎల్‌ఈడీ దీపాల ఏర్పాటు అనంతరం ఈ మొత్తం రూ.7.5 కోట్ల నుంచి రూ.8 కోట్లకు తగ్గింది. దాదాపు సగం ఖర్చు తగ్గడంతో పాటు, విద్యుత్ ఆదాతో సహజ వనరుల వినియోగమూ తగ్గిందని బల్దియా గతంలో గొప్పగా ప్రకటించింది. కొత్త లైట్లు ఏర్పాటు చేసిన అనంతరం మూడు, నాలుగేళ్లు కొంత పర్వాలేదనిపించినా.. ఆ తర్వాత ఇబ్బందులు మొదలయ్యాయి. పాడైన లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంపై ఈఈఎస్ఎల్ దృష్టి సారించలేదు. మరమ్మతు పనులూ పట్టించుకోలేదు. 98 శాతం వీధి దీపాలు వెలిగితేనే పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించాల్సి ఉండగా.. ఆ స్థాయిలో గ్లోయింగ్ పర్సంటేజీ లేకున్నా ఒప్పందం ప్రకారం జీహెచ్‌ఎంసీ మొదట్లో జరిమానా విధించలేదు. తర్వాత నామమాత్రపు పెనాల్టీతో సరిపెట్టారు.

ఏడేళ్లలో రూ.10 కోట్లకు మించి పెనాల్టీ వేయకపోవడం గమనార్హం. ఆటోమేటిక్‌గా లైట్లు వెలిగి బంద్ అయ్యేలా ఏర్పాటుచేసిన సెంట్రల్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ సిస్టమ్(సీసీఎంఎస్) కూడా సక్రమంగా పనిచేయడం లేదు. పలు ప్రాంతాల్లో పగలు, రాత్రి అన్న తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి.

ప్రమాదాలు.. ప్రాణాలకు ముప్పు..

నగరంలోని ప్రధాన, అంతర్గత రహదారుల్లో అంధకారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సికింద్రాబాద్ నుంచి వెళ్లే రాజీవ్ రహదారిపై కొన్నాళ్లుగా వీధి దీపాలు వెలగడం లేదు. సాయంత్రం 6 గంటలకు వెలుగుతున్న వీధి దీపాలు పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి అనంతరం ఆఫ్ అవుతున్నాయి. సాంకేతిక లోపమా..? ఉద్దేశ్యపూర్వకంగా ఎవరైనా బంద్ చేస్తున్నారా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో రోడ్లపై గుంతలు, కంకర వంటివి కనిపించక రాత్రి వేళ విధులు ముగించుకొని వెళ్తోన్న ఉద్యోగులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చీకటి వల్ల ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో క్షతగాత్రులుగా మారుతుండగా, ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే దుస్థితి నెలకొంటోంది. జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యంతో జరిగిన ఈ ప్రమాదాలతో వారి కుటుంబాలు తీవ్ర క్షోభ అనుభవిస్తున్నాయి. ప్రమాదంలో ఓ వ్యక్తి కాలు/చేయి విరిగితే రెండు, మూడు నెలలు విశ్రాంతి తీసుకోవాల్సి వస్తోంది. ఆ తరువాత అయితే ఎప్పటిలా పనిచేసే పరిస్థితి ఉండదు. ఇక ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల బాధలు వర్ణనాతీతం. 'చీకటి ఉండడంతో రోడ్డుపై గుంత కనిపించక ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడింది. దీంతో కాలు విరిగి.. మూడు నెలలు మంచానికే పరిమితమయ్యా. ప్రైవేట్ సంస్థలో పనిచేసే నాకు ఆ మూడు నెలలు పూర్తిస్థాయి వేతనం రాలేదు. దీంతో కుటుంబం గడవడమూ కష్టంగా మారింది. వైద్య చికిత్స, కుటుంబ పోషణకు అప్పు చేయాల్సి వచ్చింది' అని చింతల్‌కు చెందిన ఓ వ్యక్తి పేర్కొన్నారు.

న్యాయపరంగా..

ఈఈఎస్ఎల్ పనితీరుపై అసంతృప్తితో ఉన్న జీహెచ్‌ఎంసీ.. ఆ సంస్థపై చర్యలు తీసుకునే విషయంలో ముందడుగు వేయడం లేదు. ఆ సంస్థను టెర్మినేట్ చేయాలని ఇప్పటికే పలుమార్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆదేశించారు. ఒప్పందంలో ఉన్న అంశాల నేపథ్యంలో టెర్మినేట్ చేసేందుకు అవకాశం లేదని బల్దియాలోని వీధి దీపాల విభాగం వర్గాలు చెబుతున్నాయి. ఈ విషయంపై న్యాయ సలహా తీసుకున్న అధికారులు ఈఈఎస్ఎల్ ఉద్వాసన విషయాన్ని ప్రస్తుతానికి పక్కన పెట్టారు. టెర్మినేట్ చేయాలంటే సాంకేతికంగా, న్యాయపరంగా ఇబ్బందులు లేకుండా చూడాల్సి ఉంటుంది. మరో ఐదు నెలలు మాత్రమే గడువు ఉన్న దృష్ట్యా రిస్క్ ఎందుకని ఓ అధికారి పేర్కొన్నారు.

చైన్‌స్నాచింగ్‌లు.. పనిచేయని కెమెరాలు

కాలనీల్లో చీకటి ఉండడంతో రాత్రి వేళ బయటకు రావాలంటే మహిళలు జంకుతున్నారు. బయటకు వస్తోన్న మహిళలు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోంది. తెల్లవారుజామున చైన్ స్నాచింగ్‌లూ జరుగుతున్నాయి. సీసీ కెమెరాలు ఉన్నా.. చీకటి ఉండడంతో రికార్డు అయ్యే పరిస్థితి లేదు. ఆ ప్రాంతాలను ఎంచుకొని చోరీలకు పాల్పడుతున్నారు. ప్రముఖులు ఉండే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ఐటీ ఉద్యోగులు ఉండే మాదాపూర్, రాయదుర్గం, కొండాపూర్, చందానగర్ వంటి ప్రాంతాల్లోనూ వీధి దీపాల ఫిర్యాదులను జీహెచ్‌ఎంసీ పట్టించుకోవడం లేదు. జీహెచ్‌ఎంసీలోని ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్లు పంపుతోన్న ఫిర్యాదులను ఈఈఎస్ఎల్ బృందాలు పట్టించుకోవడం లేదు. ఇతరత్రా పనుల్లో ఉన్నామని ఆ సంస్థ ప్రతినిధులు చెబుతున్నట్టు ఓ ఏఈ తెలిపారు. పాడైన లైట్ల స్థానంలో ఏర్పాటు చేసేందుకు కొత్త లైట్లూ అందుబాటులో లేకపోవడం గమనార్హం.